
## క్లుప్తంగా

### ఆలయ గోపురంపై మొక్కల తొలగింపు


ఆలయ గోపురంపై పెరిగిన మొక్కలు తొలగిస్తున్న సిబ్బంది

కాకినాడ రూరల్: సర్పవరంలో వేంచేసి ఉన్న శ్రీరాజ్యలక్ష్మి సమేత భావనారాయణ స్వామి ఆలయం ఉత్తర రాజగోపురంపై మొక్కలు మొలవడంతో వాటిని భారీ క్రేన్ సహాయంతో బుధవారం తొలగించారు. ఆలయ ఈఓ మాచిరాజు లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో సిబ్బంది, గ్రామస్తులు సహాయంతో మొక్కలు తొలగింపు పనులు చేపట్టారు. గ్రామంలో అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలకు కోసం వచ్చిన రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ మొక్కలు తొలగింపు పనులకు క్రేన్ ద్వారా గోపురం కొద్ది దూరం పైకి వెళ్లి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పుల్ల శ్రీరాములు, ముద్దన ప్రకాష్ పాల్గొన్నారు.

### పది గంటల పని విధానానికి వ్యతిరేకంగా నిరసన


వలసపాకలలో ఎఫ్ఎన్‌టీయూ ఆధ్వర్యంలో కార్మికుల నిరసన


కాకినాడ రూరల్: కూటమి ప్రభుత్వం పది గంటల పని విధానాన్ని తీసుకువచ్చేందుకు నిర్ణయించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని ఫెడరేషన్ ఆఫ్ నేషనల్ ట్రేడ్ యూనియన్స్(ఎఫ్ఎన్‌టీయూ) రాష్ట్ర కన్వీనర్ రంబాల సతీష్ పేర్కొన్నారు. పది గంటల పని విధానం తీసుకువస్తూ రాష్ట్ర క్యాబినెట్ సమావేశంలో తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా కాకినాడ రూరల్ వలసపాకల, వాకలపూడిలో పోర్టు, పరిశ్రమల్లో కార్మికులు ఎఫ్ఎన్‌టీయూ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. పని గంటలు మార్పు చేయవద్దని వారు నినదించారు. ఈ కార్యక్రమంలో జూలై 9న సమ్మె చేపట్టబోయే సమ్మె విజయవంతం చేస్తామన్నారు.

### 250 మందికి వైద్య పరీక్షలు


ఉచిత వైద్య శిబిరంలో రోగులకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

బోట్‌క్లబ్: మాజీ కార్పొరేటర్ మాకినీడి శేషుకుమారి ఆధ్వర్యంలో సూర్యగ్లోబల్ హాస్పిటల్ వైద్యులు బుధవారం స్థానిక వార్ఫ్ రోడ్డులో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ప్రముఖ వైద్యుడు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో 250 మందికి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందించారు. ఈ కార్యక్రమంలో కుడా మాజీ చైర్మన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, మాజీ కార్పొటర్లు నల్లబిల్లి సుజాత, రాగిరెడ్డి అరుణ్‌కుమార్, ఏఐడబ్ల్యూసీ సభ్యులు భానుశేషు, చక్కా సుశీ సూర్య గ్లోబల్ మార్కెటింగ్ మేనేజర్‌లు అశోక్, వీరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

### యంగ్ మైండ్ సంస్థ సేవలు అభినందనీయం


జాహ్నవికి ఏపీపీఎస్‌పీ పాఠశాలలో అడ్మిషన్ పత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు

బాలాజీచెరువు: ప్రైవేట్ హాస్పిటల్లో చికిత్స పొందుతున్న చిన్నారి జాహ్నవికి యంగ్ మైండ్ స్వచ్ఛంద సంస్థ సభ్యులు అందించిన సేవలు అభినందనీయమని విద్యాశాఖ ఆర్‌జేడీ నాగమణి పేర్కొన్నారు. ఇటీవలే జాహ్నవి దాదాపు 80 శాతం శరీరం కాలిపోగా యంగ్‌మైండ్ సంస్థ, దాతలు కలిసి దాదాపు రూ.24 లక్షలు ఆర్థిక సహాయం అందజేసి వైద్యఖర్చులు భరించారు. జాహ్నవి ఆరోగ్యం మెరుగుపడి కోలుకుని పాఠశాలకు వెళ్లేలా హాస్పిటల్ వైద్య సిబ్బంది, సంస్థ వ్యవస్థాపకులు వాకాడ వెంకటరమణ కృషి చేసారు. జాహ్నవికి ఏపీపీఎస్‌పీ ఎంపీపీ మోడల్ స్కూల్లో 5వ తరగతి అడ్మిషన్‌తో పాటు అతని సోదరుడిని ఉన్నత పాఠశాలలో గురువారం చేర్పించారు.

### తపాలా జీవిత బీమా ఏజెంట్ల నియామకం

బాలాజీచెరువు: తపాలా జీవిత బీమాకు ఏజెంట్లుగా పనిచేయడానికి అర్హత గల యువతీ యువకుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పోస్టల్ సూపరింటెంటెంట్ ఆర్.నవీన్‌కుమార్ బుధవారం తెలిపారు. వయస్సు 18 సంవత్సరాలు పైబడి పదవ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని, దరఖాస్తులు ఈ నెల 20వ తేదీలోగా కాకినాడ పోస్టల్ కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

# వైద్య విజ్ఞాన వేదిక ఎరెవ్నా

- కాకినాడ రంగరాయ వైద్య కళాశాలలో నేటి నుంచి ఎరెవ్నా సదస్సు
- పాల్గొననున్న 600 మంది వైద్య విద్యార్థులు
- మూడు రోజుల పాటు నిర్వహణ
- 'ఇగ్నైటింగ్ యంగ్ మైండ్స్' నినాదంతో కార్యక్రమం నిర్వహణ



ఎరివ్నాకు ఆహ్వానం పలుకుతూ..

కాకినాడ క్రైం: వైద్య విద్యార్థుల విజ్ఞాన వీచిక 'ఎరెవ్నా' భవిష్యత్తు వైద్య మేధావులకు ఆహ్వానం పలుకుతోంది. వైభవంగా, సర్వాంగ సుందరంగా ముస్తాబై మురిపిస్తోంది. అశేష జ్ఞానాన్ని తనలో ఇనుమడింపజేసుకొని ఆహుతులకు పంచివ్వాలని ఆత్రంగా ఎదురుచూస్తోంది. జ్ఞాన సముపార్జనే పరమావధిగా వైద్య విద్యలో నాణ్యతా ప్రమాణాలను వృద్ధి చేసి, పంచేందుకు వేదిక ఉవ్విళ్లూరుతోంది.

**అపార జ్ఞాన సంపత్తితో వెలుగులు**

వైద్య విద్యార్థుల విజ్ఞాన సదస్సు ఎరెవ్నా 4.0 గురువారం నుంచి రంగరాయ వైద్య కళాశాలలోని ఫార్మకాలజీ లెక్చర్ గ్యాలరీ వేదికపై ప్రారంభం కానుంది. ఇందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. రంగరాయ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అత్తలూరి విష్ణువర్ధన్ పర్యవేక్షణలో ఎంబీబీఎస్ చివరి సంవత్సరం చదువుతున్న ఆర్ఎంసీ విద్యార్థుల ఆధ్వర్యంలో ఎరెవ్నా 4.0ను నిర్వహిస్తున్నారు. వైద్యాధికారులు ఈ సదస్సులో పాల్గొంటారు.

**ఎరెవ్నా... ఓ అరుదైన సదస్సు**

విద్యార్థులే విద్యార్థుల కోసం నిర్వహించే ఓ అరుదైన సదస్సు ఎరెవ్నా. గడచిన నాలుగేళ్లుగా కాకినాడ రంగరాయ వైద్య కళాశాల నిర్వహిస్తున్న ఓ ప్రతిష్టాత్మక వైద్య విజ్ఞాన వార్షిక సదస్సు. ఈ సదస్సులో అధునాతన వైద్య విధానాలపై చర్చిస్తారు. ఇప్పటికే ఉనికిలో ఉన్న విధానాలపై కార్యశాలలు, ప్రజెంటేషన్లు నిర్వహించి వైద్య విద్యార్థులకు లోతైన అవగాహన కల్పిస్తారు. ప్రిన్సిపాల్ సహా వైద్య రంగంలోని ఉద్దండులంతా అతిథులుగా హాజరుకానున్నారు.

**21 డిపార్టుమెంట్లు... 27 వర్క్‌షాప్‌లు**

ఎరెవ్నాలో వైద్య విద్యార్థులకు విజ్ఞానాన్ని పంచి ఇచ్చేందుకు రంగరాయ వైద్య కళాశాలకు చెందిన 21 డిపార్టుమెంట్లు భాగస్వామ్యమయ్యాయి.


ప్రతిష్టాత్మక ఎరెవ్నా సదస్సుకు వేదిక ఫార్మకాలజీ లెక్చర్ గ్యాలరీ

ఆయా డిపార్టుమెంట్ల తరఫున 27 వర్క్ షాప్‌లు నిర్వహించనున్నారు. ఆప్తాల్మాలజీ, పల్మనాలజీ, ఆర్థోపెడిక్స్, ప్లాస్టిక్ సర్జరీ, ఫోరెన్సిక్ మెడిసిన్ అండ్ టాక్సికాలజీ, జనరల్ సర్జరీ, పీడియాట్రిక్ సర్జరీ, పీడియాట్రిక్స్, కమ్యూనిటీ మెడిసిన్, గైనకాలజీ, ఈఎన్‌టీ, అంకాలజీ, న్యూరో సర్జరీ, అనస్థీషియాలజీ, డెర్మటాలజీ, రేడియాలజీ, బయో కెమిస్ట్రీ, సైకియాట్రీ, ఫార్మకాలజీ, మైక్రో బయోలజీ, ఫిజియోలజీ డిపార్టుమెంట్లు కీలకంగా వ్యవహరించనున్నాయి.

**పోటీల్లో వైవిధ్యం**

ఎరెవ్నా ఆద్యంతం అపార జ్ఞాన సంపత్తిని, విజ్ఞానాన్ని పంచి ఇచ్చే ఓ అపురూప సదస్సుగా కొనసాగనుంది. ఆటవిడుపు కోసం నిర్వహించే పోటీలు కూడా విజ్ఞాన వీచికలై విరాజిల్లనున్నాయి. బ్రెయిన్


స్పాట్ రిజిస్ట్రేషన్ల ప్రక్రియ

బ్లిడ్జ్ క్విజ్, పేపర్ ప్రజెంటేషన్, పోస్టర్ కాంపిటేషన్, కేస్ ప్రజెంటేషన్, మెడికల్ డిబేట్, అనాటమీ బాడీ పెయింటింగ్, హిస్టో రంగోలి, ట్రెజర్ హంట్, రోల్ రేస్ అండ్ రీచ్, మెడికల్ లిఫ్ట్ ఫొటోగ్రఫీ, మెడికల్ పొయిట్రీ వంటి పోటీలతో విద్యార్థుల్లో ఉన్న తృష్ణను మరింత పెంపొందించే వైవిధ్యాన్ని జోడించారు.

**ప్రిన్సిపాల్‌దే మాస్టర్ బ్రెయిన్**

ఇంతటి సదస్సును విద్యార్థుల వెన్నంటే ఉండి నడిపిస్తున్న ఘనత మాత్రం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విష్ణువర్ధన్‌దే. గతంలో వైస్ ప్రిన్సిపాల్ హోదాలో మూడు సదస్సులు నిర్వహించిన అనుభవం ఆయనది. ఆయనకున్న పరిచయాలు, ప్రణాళికాబద్ధ అనుసరణ ఎరివ్నా నిర్వహణకు విద్యార్థులకు ఎంతగానో సహకరించాయి. విద్యార్థులకు తన సూచనలతో మార్గనిర్దేశం చేయడం, ప్రతిష్టాత్మక వాల్‌స్ట్రీట్ జనరల్ సహా అంతర్జాతీయ వైద్య ప్రచురణను నిత్యం చదువుతూ అందులో విశేషాల ప్రాతిపదికన ఔత్సాహికులైన విద్యార్థులతో పంచుకుంటూ ఉంటారు. జాతీయ అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించనున్న వైద్య విజ్ఞాన సదస్సు, అందులో విశేషాలను అందిపుచ్చుకొని విద్యార్థులను ఆ దిశగా నడిపించారు. ఆయన స్ఫూర్తితోనే సదస్సును నిర్వహించే మనోధైర్యం లభించిందని కోర్ కమిటీ తెలిపింది.

**3 రోజులు... 600 మంది**

ఎరెవ్నా వైద్య విజ్ఞాన సదస్సుకు 600 మంది వైద్య విద్యార్థులు నమోదయ్యారు. వీరిలో పొరుగు జిల్లాల నుంచి వచ్చిన వారు కూడా ఉన్నారు. ఇంకొందరు తెలంగాణ నుంచి వచ్చారు. 12, 13, 14 తేదీల్లో మూడు రోజుల పాటు ఈ సదస్సు నిర్వహించనున్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ విష్ణువర్ధన్ పర్యవేక్షణలో నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ ఎన్‌టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వీసీ డాక్టర్ చంద్రశేఖర్, విశిష్ట అతిథిగా డీఎంఈ డాక్టర్ డీఏస్‌వీఎల్ నరసింహం, గౌరవ అతిథులుగా అకడమిక్ డీఎంఈ డాక్టర్ రఘునందన్, కాకినాడ జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్య కుమారి హాజరుకానున్నారు.

**నేర్చుకునే వాళ్లకి నేర్చుకున్నంత**



వైద్య విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ప్రతి అంశాన్ని నోట్స్ రూపంలో అనుసరించాలి. గెలిచినా, లేకున్నా ప్రతి పోటీలోనూ పాల్గొనాలి. వైద్య రంగంలో చోటు చేసుకుంటున్న అరుదైన, ప్రధానమైన మార్పులను ఈ వేదికపై ఆవిష్కరిస్తారు. నేర్చుకునే వాళ్లకి నేర్చుకున్నంత అవకాశం ఈ సదస్సు కల్పిస్తోంది. 'ఇగ్నైటింగ్ యంగ్ మైండ్స్' అన్న ఎరెవ్నా 4.0 నినాదాన్ని ప్రతిబింబించేలా అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. వైద్య విశేషాలు, ఆవిష్కరణలు వైద్య విద్యార్థులు తెలుసుకోవచ్చు. వైస్ ప్రిన్సిపాల్లు డాక్టర్ శశి, డాక్టర్ ఉమామహేశ్వరరావులు సదస్సు నిర్వహణకు విద్యార్థులకు సహాయకారిగా ఉంటున్నారు.

– డాక్టర్ ఏ.విష్ణువర్ధన్, ప్రిన్సిపాల్, రంగరాయ వైద్య కళాశాల, కాకినాడ

## నేడు కరపలో ఆలయ భూములు కౌలుకు వేలం

కరప: స్థానిక విష్ణ్వాలయంలో గురువారం ఉదయం 10 గంటలకు గ్రామంలో వేంచేసిన రామలింగేశ్వరస్వామి (శివాలయం) వారి దేవస్థానం భూములు కౌలుకు సాగు చేసుకోవడానికి మూడేళ్ల పరిమితికి బహిరంగ వేలం నిర్వహిస్తామని ఆశాఖ ఈఓ కె.తిరుమల రవితేజ తెలిపారు. కరపలో బుధవారం ఆయన స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. 5 ప్రతులుగా ఉండే 1,088 ఎకరాలకు వేలం పాట నిర్వహిస్తామన్నారు. వేలంటలో పాల్గొనేవారు ప్రథమ ధరావత్తుగా రూ.4 వేలు చెల్లించాలన్నారు. ఎటువంటి తగాదా లేని భూమి 3 సంవత్సరాల మగతాకు సరిపడు హామీ ఇవ్వాల్సి ఉంటుందన్నారు. పాటదారుడు ఆధార్‌కార్డు సమర్పించి, రెవెన్యూ అధికారుల నుంచి తీసుకున్న తనకుగల నిర్దిష్టమైన స్థిరాస్తికి సంబంధించిన సాల్వెన్సీ సర్టిఫికెట్ వేలం సమయంలో సమర్పించాలని, హిందువులు మాత్రమే పాల్గొనాలన్నారు. పాటదారుడు ముందుగా పంట భూములను చూసుకుని వేలంలో పాల్గొనాలన్నారు. వేలం ఆమోదించిన వెంటనే హెచ్చు పాటదారుడు మొత్తం సొమ్మును ఒక సంవత్సరానికి నిర్ణయించి, అందులో సగభాగం మొదటి పంటకు, మిగిలిన సగభాగం రెండో పంటకు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈ బహిరంగ వేలం పాట కౌలుహక్కు నగదు రూపంలో నిర్ణయించి, వేలం నిర్వహిస్తామని ఈఓ తిరుమల రవితేజ వివరించారు. అనంతరం అదేరోజు మధ్యాహ్నం 12.30 గంటలకు కూరాడ శివారు చినమామిడాడలోని పంచముఖేశ్వర చైతన్య ట్రస్ట్ తాలూకు దేవస్థానం భూములకు కూడా కౌలుకు సాగు చేసుకోవడానికి బహిరంగ వేలం నిర్వహిస్తామని ఈఓ తిరుమల రవితేజ తెలిపారు. ఈ ట్రస్ట్‌కు చెందిన భూములు కరపలో 6 ప్రతులుగా 20.69 ఎకరాలు, చినమామిడాడలో 2.36 ఎకరాలు, వేళంగిలో 2.26 ఎకరాలు, యండమూరులో 0.17 ఎకరాలు, వేళంగిలో 0.86 ఎకరాల మెరక భూమి ఉందని తెలిపారు. వీటిని కౌలుకు సాగు చేసుకోవడానికి వేలం నిర్వహిస్తామన్నారు. వేలంలో పాల్గొనే వారు ప్రథమ ధరావత్తుగా రూ 5 వేలు చెల్లించాలని ఈఓ తెలిపారు.

## ప్రజావసరాలకు అనుగుణంగా రోడ్ల నిర్మాణం


సర్పవరంలో సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న కలెక్టరు షణ్మోహన్, ఎమ్మెల్యే నానాజీ

కాకినాడ రూరల్: ప్రజల అవసరాలకు అనుగుణంగా రోడ్ల నిర్మాణం చేపడుతున్నట్టు కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ తెలిపారు. సర్పవరంలో ఉపాధి నిధులు రూ.98 లక్షలతో భావనారాయణ స్వామి గుడి సమీపం నుంచి 216 జాతీయ రహదారి బైపాస్ వరకు నిర్మించిన సీసీ రోడ్డును ఎమ్మెల్యే పంతం నానాజీ, కలెక్టరు షణ్మోహన్‌తో కలసి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఏడాదిగా చేపట్టిన అభివృద్ధి పనుల్లో పూర్తయిన 200 పనులను ఆయా నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు ప్రారంభించనున్నారని తెలిపారు. అనంతరం సర్పవరంలో నిర్మించిన పశువుల నీటి తొట్టెను, పెనుమర్తిలో గోకులం షెడ్డు, వాటర్ ట్యాంక్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ వెంకటలక్ష్మి, ఆర్డీఓ మల్లిబాబు, ఎంపీడీఓ సతీష్, తహశీల్దార్ కుమారి, పంచాయతీరాజ్ డీఈ శ్రీనివాస్, ఎంపీపీ అనంతలక్ష్మి, పుల్ల శ్రీరాములు పాల్గొన్నారు.

**అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం**

కరప: వేళంగిలో బుధవారం కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ పర్యటించి పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు చేశారు. గ్రామంలో రూ.30 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లకు ఎమ్మెల్యే ప్రారంభోత్సవాలు చేశారు. తర్వాత గ్రామంలో నిర్మించిన పశువుల నీటితొట్టెను ప్రారంభించారు. గ్రామంలోని కొప్పిశెట్టివారి వీధిలో ఇంటింటికీ కుళాయిలు కార్యక్రమంలో మిగిలిన 12 గృహాలకు కూడా కుళాయిలు వేయించాలని ఆ ప్రాంత ప్రజలు కోరారు. కొప్పిశెట్టివారివీధి దుర్గాదేవి గుడి, కొత్తపేటలోని వినాయకుని గుడికి నిధులు మంజూరు చేయించి, ఆధునీకరించాలని ఆయా వీధుల ప్రజలు ఎమ్మెల్యేను కోరగా పుష్కర గ్రాంట్ వచ్చాక ఇస్తామని ఆయన గ్రామస్తులకు తెలిపారు. సర్పంచ్ సవిలే నీలిమ, ఎంపీడీఓ ఎం.అనుపమ, చుండ్రు వెంకన్నారావు, గరగ జెమ్మీ, పట్టాభి, సవిలే రాజేష్ పాల్గొన్నారు.

## పంచారామ క్షేత్రంలో వైస్ చాన్సలర్

సామర్లకోట: పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరి సమేత కుమారారామ భీమేశ్వరస్వామి ఆలయాన్ని బుధవారం రాత్రి ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ పి.చంద్రశేఖర్ సందర్శించారు. ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. స్వామి, అమ్మవార్లను దర్శించుకున్న ఆయనకు ఆలయ పండితులు ఆశీర్వచనాలు అందజేశారు. స్వామివారి ప్రసాదం, ఫొటోను ఆలయ సూపరింటెండెంట్ ఈశ్వరరావు అందజేశారు. పంచారామ క్షేత్రంలో స్వామివారికి బుధవారం ప్రత్యేక పూజలు జరిగాయి. జ్యేష్ట పౌర్ణమి కావడంతో స్వామి, అమ్మవారికి, ఉపాలయాల్లో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను పల్లకీలో ఉంచి ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి, అమ్మవార్లను, ఉపాలయాలను దర్శించుకున్నారని ఈఓ బళ్ల నీలకంఠం తెలిపారు. ఆలయ పండితులు వేమూరి సోమేశ్వరశర్మ, అళ్లకి రాజగోపాల్‌శర్మ, సన్నిధిరాజు వెంకన్న, శ్రీకాకుళపు సత్యనారాయణ మూర్తి, వినయ్, చెరుకూరి రాంబాబు పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణలు చేశారు.

## మితాహారంతోనే ఆరోగ్యం


వృద్ధులకు పాదరక్షలు పంపిణీ చేస్తున్న వైద్యురాలు వరలక్ష్మి తదితరులు

కాకినాడ రూరల్: మనం తీసుకునే ఆహారం పైనే మన ఆరోగ్యం ఆధారపడి ఉన్నందున మితాహారం తీసుకోవాలని ప్రాణిక్ హీలింగ్ వైద్యురాలు ఎం.వరలక్ష్మి పేర్కొన్నారు. రమణయ్యపేట ఇందిరా కాలనీలో వరలక్ష్మి సౌజన్యంతో వృద్ధులకు పాదరక్షలు, విసన కర్రలు, మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి వ్యక్తి ఎత్తుకు తగ్గ బరువు ఉండాలని అన్నారు. మనం రోజూ ఏం తింటున్నాం అని కాకుండా ఎంత పోషకాలు తీసుకుంటున్నామనేది ముఖ్యమన్నారు. ముఖ్యంగా వృద్ధాప్యంలో జీర్ణవ్యవస్థ సామర్థ్యం తగ్గుతుందని, అందువల్ల పోషక విలువలు గల ఆహారాన్ని పరిమితంగా తీసుకోవాలన్నారు. వేపుళ్లు, చిరుతిళ్లు తగదన్నారు. మంచినీళ్ల అధికంగా తాగాలని, రోజు నడక వ్యాయామం చేయాలని పేర్కొన్నారు. ఏటా వేసవిలో వృద్ధులకు పాదరక్షలు, విసన కర్రలు, మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్నామని వరలక్ష్మి తెలిపారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, నిమ్మకాయల వెంకటేశ్వరరావు, ప్రసాద్‌నాయుడు పాల్గొన్నారు.

## 22న 'గోదావరి కవితా పండుగ'


గోదావరి కవితా పండుగ, జాతీయ కవి సమ్మేళనం బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న నరసింహమూర్తి, ఏబీ నాయుడు

అమలాపురం టౌన్: కాకినాడ పీఆర్ కళాశాల ఆడిటోరియంలో అంతర్జాతీయ సాహిత్య, సాంస్కృతిక సంస్థ శ్రీశ్రీ కళా వేదిక ఆధ్వర్యంలో ఈనెల 22న గోదావరి కవితా పండుగ 149వ జాతీయ ద్విశతాధిక కవి సమ్మేళనం నిర్వహించనున్నట్టు వేదిక కోనసీమ జిల్లా అధ్యక్షుడు నల్లా నరసింహమూర్తి తెలిపారు. ఈ సమ్మేళనం బ్రోచర్లను స్థానిక విద్యానిధి విద్యా సంస్థల కార్యాలయంలో విద్యా సంస్థల చైర్మన్ ఏబీ నాయుడు తదితరులతో ఆయన బుధవారం ఆవిష్కరించారు. శ్రీశ్రీ కళా వేదిక సీఈవో డాక్టర్ కత్తిమండ ప్రతాప్ సారథ్యంలో ఈ సమ్మేళనం జరుగుతుందని నరసింహమూర్తి తెలిపారు. సాహిత్యాన్ని ప్రోత్సహిస్తూ సాహిత్య విలువలను కాపాడుతూ ఇప్పటి వరకూ 148 కవి సమ్మేళనాలను నిర్వహించినట్టు ఆయన తెలిపారు. దేశవ్యాప్తంగా 200 మందికి పైగా కవులు ఈ సమ్మేళనానికి హాజరుకానున్నారని పేర్కొన్నారు. జాతీయ కవి సమ్మేళానికి ఎలాంటి రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించనవసరం లేదని, రిజిస్ట్రేషన్ చేయించుకున్న ప్రతీ కవికి జ్ఞాపిక, ప్రశంసా పత్రం, సత్కారం ఉంటాయని నరసింహమూర్తి తెలిపారు.

## క్రమశిక్షణతో కూడిన జీవనశైలి అవసరం


డాక్టర్ స్వరూప్‌ను సత్కరిస్తున్న ఇండియన్ డెంటల్ అసోసియేషన్ సభ్యులు

బోట్‌క్లబ్: మన జీవితం అందంగా మార్చుకోవాలంటే వారికి క్రమశిక్షణతో కూడిన జీవనశైలి అవసరమని ఇండియన్ అసోసియేషన్ కార్యదర్శి అడ్డాల సత్యనారాయణ అన్నారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం భానుగుడి వద్ద ఒక హాస్పిటల్‌లో సమస్యల పట్ల అనుసరించాల్సిన విధానాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం అసోసియేషన్ ఆధ్వర్యంలో స్వరూప్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు నాగేంద్ర, శ్రీవల్లీ, సిరాజ్, చైతన్య, పద్మావతి పాల్గొన్నారు.

## బదిలీల ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలి


డీఎంహెచ్‌వో డాక్టర్ నరసింహనాయక్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న ఏపీఎన్‌జీవో నేతలు

కాకినాడ క్రైం: బదిలీల ప్రక్రియలో భాగంగా ఏపీఎన్‌జీవో అసోసియేషన్ ఆఫీస్ బేరర్లకు ప్రభుత్వం ఇచ్చిన 9 ఏళ్ల మినహాయింపును పరిగణించాలని సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పసుపులేటి శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి వెంకటకృష్ణ ఆధ్వర్యంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నేతలు బుధవారం సాయంత్రం డీఎంహెచ్‌వో డాక్టర్ నరసింహ నాయక్‌ను కలిసారు. ఈ మేరకు వినతిపత్రం సమర్పించి జిల్లా పరిధిలో వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగుల బదిలీల ప్రక్రియ పారదర్శకంగా చేపట్టాలని కోరారు. ఆఫీస్ బేరర్లకు స్టేషన్ సీనియారిటీ కాకుండా ఆఫీస్ బేరర్ అయినప్పటి నుంచి 9 ఏళ్లు లెక్కించాలని ప్రభుత్వం జీఏడీ సర్కులర్ మెమోలో ఈ విషయాన్ని స్పష్టంగా పేర్కొందని చెబుతూ సంబంధిత కాపీలు అందజేశారు. సానుకూలంగా స్పందించిన డీఎంహెచ్‌వో ప్రభుత్వ ఆదేశాలమేరకే నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. డీఎంహెచ్‌వోను కలిసిన వారిలో సంఘ జిల్లా అధ్యక్షుడు గుద్దటి రామ్మోహనరావు, సహాయ అధ్యక్షుడు మట్టపర్తి వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులు పాలపర్తి మూర్తిబాబు, సరెళ్ల చంద్రరావు, సంఘ నగర నేతలు ఉన్నారు.

## అంధత్వ రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి


నేత్రదానంపై అవగాహన కల్పిస్తున్న వైద్యులు

బాలాజీచెరువు: అంధత్వ రహిత జిల్లాకు తీర్చిదిద్దడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బాదం బాలకృష్ణ ఐ బ్యాంక్ ఫౌండర్ బాదం బాలకృష్ణ పేర్కొన్నారు. ఎస్ఏఫ్‌సీఎల్ రోడ్డులోని సత్యభాస్కర జీవన సంధ్య వృద్ధుల ఆశ్రమంలో గురువారం నేత్రదాన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ ఇప్పటి వరకూ ఐ బ్యాంక్ ద్వారా 7472 కార్నియాలు సేకరించి అంధులకు కంటి చూపు ప్రసాదించామన్నారు. అనంతరం నేత్రదానంపై ప్రతిజ్ఞ చేయించి కరపత్రాలు పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో ఐ బ్యాంక్ వైస్ చైర్మన్ కొల్లేపల్లి మురళీకృష్ణ, టెక్నీషియన్ నానాజీ, రవికుమార్, నాని, వీరేంద్ర పాల్గొన్నారు.

### రైల్వే రాయితీల కోసం పోస్ట్ కార్డు ఉద్యమం


మాట్లాడుతున్న సీనియర్ సిటిజన్స్ జిల్లా అధ్యక్షుడు బుద్ధరాజు సత్యనారాయణరాజు

కాకినాడ రూరల్: జనాభాలో 12శాతం ఉన్న వృద్ధులకు అవసరమైన ఆరోగ్య వసతులు, సామాజిక భద్రత తదితర సౌకర్యాలను కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉన్నందున సీనియర్ సిటిజన్స్‌కు రైల్వే రాయితీలను పునరుద్ధరించాలని సీనియర్ సిటిజన్స్ జిల్లా అధ్యక్షుడు బుద్ధరాజు సత్యనారాయణరాజు పేర్కొన్నారు. రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. గతంలో 60 ఏళ్లు నిండిన పురుషులకు, 58 ఏళ్లు నిండిన మహిళలకు రైల్వే చార్జీల్లో రాయితీలు ఉండేవన్నారు. కరోనా సమయంలో కేంద్ర ప్రభుత్వం వాటిని తాత్కాలికంగా నిలిపివేసిందని తెలిపారు. జాతీయ సీనియర్ సిటిజన్స్ సంఘం పిలుపు మేరకు అన్ని పట్టణాలు, గ్రామాల నుంచి ప్రధానమంత్రికి రాయితీలు పునరుద్ధరించమని పోస్ట్‌కార్డు ద్వారా వృద్ధులు లేఖలు రాయాలని బుద్ధరాజు కోరారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, చింతపల్లి సుబ్బారావు పాల్గొన్నారు.

### జేఎన్‌టీయూకేలో డైరెక్టర్ల మార్పు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): పరిపాలన సంస్కరణల్లో భాగంగా జేఎన్‌టీయూ కాకినాడ వర్సిటీలో ఉన్న పలు డైరెక్టర్లను మార్పు చేస్తూ వీసీ అదేశాల మేరకూ ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ రవీంద్రనాథ్ ఉత్తర్వులు జారీ చేసారు. ఐఎస్‌టీ డైరెక్టర్‌గా డాక్టర్ బీటీ కృష్ణ, ఐటీ, ఓఎల్ ఓడీఎల్‌కు సీఎస్ఈ ప్రొఫెసర్ డాక్టర్ కే సహదేవయ్య, ఇంటర్నేషనల్ రిలేషన్స్‌కు ఏ.స్వర్ణకు మారిని నియమించారు. ఐక్యూఏసీ కెపాసిటీ బల్డింగ్ డైరెక్టర్‌గా కె.రవీంద్ర, స్టూడెంట్స్ ఎఫైర్స్‌కు కృష్ణమోహన్, అడ్మిషన్స్ సెట్స్‌కు రాముసు నియమించారు. ఎస్ఐఐఐసీకి ఏ.గోపాలకృష్ణ, డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్‌గా పద్మజారాణి, లీగల్ మ్యాటర్స్ డైరెక్టర్‌గా బాలాజీ, డైరెక్టర్ అకడమిక్స్‌కు హెచ్ఎం కృష్ణప్రసాద్‌ను నియమించారు.

### నేడు కేంద్ర సహాయ మంత్రి రాక

బోట్‌క్లబ్ (కాకినాడసిటీ): ప్రధాని మోదీ 11 ఏళ్ల పాలనపై సంకల్పంతో సహకారం కార్యక్రమంలో పాల్గొనేందుకు కేంద్ర భారీ పరిశ్రమల సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ గురువారం కాకినాడ వస్తున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు బుధవారం తెలిపారు. స్థానిక దేవాలయంవీధిలోని పైడా శ్రీనివాస కల్యాణ మండపంలో ఉదయం 10.30 గంటలకు నిర్వహించే కార్యక్రమంలో ఆయన పాల్గొంటారన్నారు.

### రేపు విద్యుత్ సరఫరాలో అంతరాయం

బోట్‌క్లబ్: నగరంలోని పలు విద్యుత్ స్టేషన్ పరిధిలో వార్షిక మరమ్మతుల నేపథ్యంలో పలు ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఈఈ ఎస్ ఉదయభాస్కర్ బుధవారం తెలిపారు. సంజయ్‌నగర్, పర్లోవ పేట, రాజీవ్ గృహకల్ప అపార్ట్‌మెంట్లు, పాత పోర్టు రైల్వే స్టేషన్, తిలక్ స్ట్రీట్, రాజాజీ వీధి, ఓల్డ్ పోస్ట్ ఆఫీస్ ప్రాంతం, గోల్డ్ మార్కెట్ సెంటర్, కొవ్వూరు రోడ్డు, శుభం కౌంటీ, గ్యాస్ గోడౌన్, అరటకట్ల పంపు హౌస్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

### 16న పోలీస్ వాహనాల విడి భాగాలు వేలం

కాకినాడ క్రైం: స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో ఉన్న మోటార్ ట్రాన్స్‌పోర్టు ఆఫీస్‌లో ఈ నెల 16న పోలీస్ వాహనాల విడిభాగాలు వేలం వేస్తామని ఎస్పీ బిందుమాధవ్ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు ఉదయం 11 గంటలకు హాజరై వేలంలో పాల్గొనాలన్నారు. మరిన్ని వివరాల కోసం మోటార్ ట్రాన్స్‌పోర్టు ఆఫీసర్‌ను 94407 96553 నంబరుకు ఫోన్ చేసి సంప్రదించాలన్నారు.

### ట్రినిటీలో ఎన్‌టీఆర్ వైద్యసేవలు

బాలాజీచెరువు: ట్రినిటీ హాస్పిటల్లో డాక్టర్ ఎన్‌టీఆర్ వైద్యసేవా పథకం ద్వారా నెఫ్రాలజీ, యూరాలజీ సేవలు అందుబాటులోకి వచ్చినట్లు ఏఐసీసీ అధ్యక్షుడు, డైరెక్టర్ రిక్కిగూటం బుధవారం తెలిపారు. ఈహెచ్ఎస్ కార్డుతో పాటు పీఎంజేఏవై, అన్ని రకాల వైద్యసేవలు అందిస్తున్నామని, వివరాలకు 94922 94433 నంబరుకు సంప్రదించాలని సూచించారు.